"నీలా! నాజలధిప్రయాణము శుభాన్వితంబు క్షేమంకరం
బై లోలత్పవనానుకూలగతిసాహాయ్యంబునన్ సాగు; ని
కేలా శంకలు? నీ వెఱుంగుటకుమున్నె వచ్చెదన్ గాపునన్
బేలా, హాయిగ వేచియుండు మిచటన్ భీతిన్ విసర్జించుమన్.

"ఊయెలలోనఁ బండుకొని యూర్పులువుచ్చుచునున్న చిన్నవాఁ
డీయబలుండు ముద్దుసుతుఁ డెంతయుఁ జక్కఁదనమ్మువాఁడు దీ
ర్ఘాయువుఁ గాంచుఁగాక పరమాత్ము ననుగ్రహదృష్టి" నంచు నీ
లాయువతీప్రియుండు పదిలమ్ముగ నుయ్యెల నూఁచెఁ బ్రేముడిన్.

అట్లు లాశాప్రయుక్తంబు లైన మధుర
భాషణంబుల నుత్సాహవంతుఁ డగుచుఁ
బలుక నేమేమొ యెదలోనఁ దలఁచుకొనుచు
వినియు వినదయ్యె నపుడు తన్వీమతల్లి.

కడకు వచియించె నీరీతిగా లతాంగి:
"నీవు ధీమంతుఁడవ, యైన నే నెఱుఁగుదు
నింత, నిశ్చయ మిది—నాథ! యింక నాకు
నీ మొగం బెన్నఁటికిని గన్పింపఁబోదు."

"ఐన నౌఁగాని, నీల నీయాననంబు
నేను గన్గొనఁజాలెద; నేల నీకు
నిట్టి సంశయభయగతు? లింకనైనఁ
జింత మాను" మటంచు వచించె విభుఁడు.

అప్పుడు వల్లి కౌఁగి తనయాంసమునందు గళమ్ము వాంచి దుః
ఖమ్మున నేడ్వఁగాఁ గనులఁ గాఱఁదొడంగిన యుష్ణబాష్పపూ
రమ్ములు నమ్మొగమ్మునకుఁ బ్రాఁకు నొసంగిన ప్రాణనాథు వ
క్షమ్ముపయిన్ బ్రవాహములుగాఁ బ్రవహించిన వాఁకుణమ్మునన్.

ఒక్కఁడొకొకటిగ వచ్చు నిట్టూర్పుల రొద,
నబికి యుప్పొంగునట్టి శోకోర్మివితతిఁ,
గనులఁ బొడమిన బాష్పముక్తాఫలాళి,
నెఱులో దాఁచుకొన్నది నీల హృదయవార్ధి.

అర్థ మొఱుఁగక నయనమ్ము లల్ల విచ్చ
యబ్బురమ్మున నాఁటిదృశ్యమ్ముఁ గాంచు
బాలికాబాలకులఁ బ్రేమలీలఁ గేలఁ
దీసికొనుచు ముద్దాడె నాథుఁ డపుడు.

గతరాత్రిని గడుఁదీవ్రమౌ జ్వరమునను గన్మోడుపే లేక పీ
డితుఁడై వేఁగిన ముద్దుపట్టి యిపు డుండెఁ గాఢనిద్రాసమ
న్వితుఁడై చేలపుటుయ్యెలన్; నెలఁత వానిన్ లేపి తేఁబోవు చో
నతఁ డాత్రంబున నేగ నయ్యెడకు వద్దంచున్ నివారించుచున్.

నిదురవోవు కొమరునిం గాంచి ముద్దాడి
యతఁడు కట్టకడకు సతికి నౌక
యెగనున్న దినము నెఱిఁగించి నౌకాత్ర
యాభిముఖుఁడుగాఁగ నరిగె వేగ.

